




# DD9 వార

తెలుగు దినపత్రిక


## మోసం కేసులో ట్విస్ట్.. మౌనం వీడిన అషు రెడ్డి



4


సంపుటి : 02 సంచిక : 268 హైదరాబాద్, ఏప్రిల్, సోమవారం 27, 2026 పేజీలు : 04 వెల : 3.00




## మలేరియా రహిత భారత్ దిశగా అడుగులు

2030 నాటికి మహమ్మారిని తరిమికొట్టాలని సీసీఎంబీ పిలుపు
హైదరాబాద్ లోప్రపంచ మలేరియా దినోత్సవ సదస్సు
నిర్మూలన లక్ష్య సాధనలో అందరి సమన్వయం కీలకం
వాతావరణ మార్పులతో కొత్త ప్రాంతాలకు విస్తరిస్తున్న వ్యాధి
'హై బర్డెన్' జాబితా నుంచి భారత్ బయటపడటంపై హర్షం
కాలేయంలోనే పరాన్నజీవి అంతమొందేలా హెర్బల్ మందులు
మలేరియా పరాన్నజీవుల సంక్లిష్టతతో శాస్త్రవేత్తలకు సవాళ్లు
పట్టణ ప్రాంతాలకు మారుతున్న వ్యాప్తి.. పెరుగుతున్న కేసులు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

భారతదేశాన్ని 2030 నాటికి మలేరియా రహిత దేశంగా మార్చడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీసీఎంబీ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ డాక్టర్ మధుసూదన రావు కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ..మిగతా 2లో

## అవసరానికి మించి నీళ్లు ఇవ్వలేం

నీటి వృథాపై జలమండలి ఆగ్రహం
తాగునీటిలో 20 శాతం పొదుపు చేయాలని విజ్ఞప్తి
నగరంలో కోటి 30 లక్షల జనాభా
సరిపడా నీటి సరఫరా చేస్తున్న బోర్డు
గోదావరి ఫేజ్ 2, 3 పనులు వచ్చే ఏడాదికి పూర్తి
సింగూరు డ్యామ్‌లో తగ్గిన నీటి మట్టం
అత్యవసర పంపింగ్ కోసం ముందస్తు ఏర్పాట్లు
వృథా అరికట్టకపోతే తీవ్ర నీటి ఎద్దడి
నగర ప్రజలకు జలమండలి ఎండీ హెచ్చరిక
రూ.720 కోట్లతో మంజీరా పాత పైపులైన్ల పునరుద్ధరణ
కొత్త పైపులైన్ల ఏర్పాటుకు టెండర్లు
ఉస్మాన్ సాగర్ నుంచి అదనంగా 25 ఎంజీడీలు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

హైదరాబాద్ నగరంలో వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి వినియోగంపై జలమండలి కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో నగర ప్రజలకు అవసరానికి మించి అదనపు నీటిని సరఫరా చేయడం సాధ్యపడదని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. నగరవ్యాప్తంగా సుమారు 2 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న 15 లక్షల నీటి కనెక్షన్లకు నిరంతరాయంగా సరఫరా జరుగుతున్నప్పటికీ, ప్రజల నుంచి అదనపు నీటి కోసం డిమాండ్ పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. కోటి 30 లక్షల జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే గరిష్ఠ స్థాయిలో నీటిని పంపిణీ చేస్తున్నామని, అయితే ప్రతి ఒక్కరు తాము వాడుకునే నీటిలో కనీసం 20 శాతం పొదుపు చేయాలని విజ్ఞప్తి చేశారు. నీటి వృథా అరికట్టకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. నల్లా నీటిని పది నిమిషాలు అదనంగా ఇస్తే రోడ్లపై పారుతున్నాయని, పది నిమిషాలు తగ్గిస్తే ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. ప్రజలు బాధ్యతగా ఉండి ప్రతి నీటి బొట్టును కాపాడుకోవాలని కోరారు.

నగర నీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళుతోంది. గోదావరి ఫేజ్ 2 మరియు 3 పనులను వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు ఎండీ వెల్లడించారు. ఈ పనులు పూర్తయితే నగరానికి ఆశించిన ..మిగతా 2లో

## రంగుల సినిమా చూపించి రేవంత్ అధికారంలోకి వచ్చాడు

రంగుల హామీలతో అధికారంలోకి వచ్చారన్న కేటీఆర్ విమర్శ
సీఎం రేవంత్‌కు 'ఐడెంటిటీ క్రైసిస్' ఉందని ఎద్దేవా
ఆరు గ్యారెంటీల అమలుపై ప్రశ్నల వర్షం
నల్గొండలో కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్, (డిడి9 వార్త):**




కాంగ్రెస్ ప్రభుత్వం , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల సమయంలో సాధ్యం కాని హామీలతో ప్రజలకు 'ఈస్ట్‌మన్ కలర్' రంగుల సినిమా చూపించి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారని ఆయన మండిపడ్డారు. నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా కేటీఆర్ చేసిన ప్రసంగం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రస్తుతం 'ఐడెంటిటీ క్రైసిస్' (గుర్తింపు సమస్య) ఏర్పడిందని ..మిగతా 2లో

## అణు శక్తి రంగంలో భారత్ సరికొత్త చరిత్ర

కల్పకం రియాక్టర్ విజయంపై ప్రధాని మోదీ ప్రశంసలు
మన్ కీ బాత్ 133వ ఎపిసోడ్‌లో కీలక వ్యాఖ్యలు
ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ క్రిటికాలిటీ దశకు చేరడం గర్వకారణం
వికసిత భారత్‌కు ఉత్తేజంగా అణు శాస్త్రవేత్తల కృషి
56 గిగావాట్లకు దేశ పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం
జనగణన-2027లో పౌరులందరూ బాధ్యతగా పాల్గొనాలని పిలుపు
డిజిటల్ పద్ధతిలో సాగనున్న దేశ గణన
సెల్ఫ్ ఎన్యూమరేషన్ పై ప్రధాని దిశానిర్దేశం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

భారతదేశ అణు ఇంధన చరిత్రలో కల్పకం ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ రియాక్టర్ క్రిటికాలిటీ దశకు చేరుకోవడం ఒక చారిత్రక ఘట్టమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. ఆదివారం నిర్వహించిన 133వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, ఈ అసాధారణ విజయం సాధించిన అణు శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ రియాక్టర్ ఏప్రిల్ 6 నుంచి ..మిగతా 2లో

## తెలంగాణలో చారిత్రక ఘట్టం

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారి జనగణన
తొలి విడతలో అందుబాటులోకి వచ్చిన ప్రత్యేక పోర్టల్
తొలి పౌరుడిగా వివరాలు నమోదు చేసుకున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా
వచ్చే నెల 10 వరకు కొనసాగనున్న సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ
తెలంగాణలో 80 వేల మంది ఎన్యూమరేటర్లతో భారీ కసరత్తు
మే 11 నుంచి జూన్ 9 వరకు నివాస గృహాల జాబితా సేకరణ
ప్రజల సందేహాల నివృత్తి కోసం 1855 నంబర్‌తో ప్రత్యేక హెల్ప్‌లైన్
16 భాషల్లో స్వీయగణన వెసులుబాటు.. సమాచార భద్రతపై అధికారుల భరోసా
జనగణనతో పాటే కులగణన ప్రక్రియ కూడా చేపడుతున్నట్లు వెల్లడి



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా 16 ఏళ్ల విరామం తర్వాత జరుగుతున్న ఈ జనగణనలో భాగంగా తొలి దశలో స్వీయగణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) పద్ధతిని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన se.census.gov.in పోర్టల్ ఉదయం 6 గంటల నుంచి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర తొలి పౌరుడు, గవర్నర్ శివప్రతాప్ శుక్లా స్వయంగా ఈ పోర్టల్‌లో తన వివరాలను నమోదు ..మిగతా 2లో

## స్వీయ గణనలో పాల్గొన్న కిషన్ రెడ్డి

ప్రజలంతాచురుకుగా పాల్గొనాలని కోరిన కేంద్ర మంత్రి
జనాభా లెక్కల ప్రాముఖ్యతను వివరించిన కిషన్ రెడ్డి
వికసిత్ భారత్ సాధనలో
జనాభా లెక్కల గణాంకాలు కీలక పాత్ర పోషిస్తాయన్న కేంద్ర మంత్రి

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

2027 జనాభా లెక్కలకు సంబంధించి తెలంగాణలో 2026 ఏప్రిల్ 26న స్వీయ గణన అధికారికంగా ప్రారంభమైన సందర్భాన్ని పురస్కరించుకొని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ. కిషన్ రెడ్డి.. నిర్ణీత ఆన్‌లైన్ జనగణన పోర్టల్ ద్వారా తన వివరాలను నమోదు చేశారు. తెలంగాణ జనగణన కార్యాలయం ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి ప్రయాణంలో జనాభా లెక్కలు ఒక పునాది రాయి వంటివని అన్నారు. ప్రణాళికా రచన, సుపరిపాలన, సమానాభివృద్ధికి ఇవి కీలక సాధనాలుగా ఆయన అభివర్ణించారు. సమర్థవంతమైన విధాన రూపకల్పన, ..మిగతా 2లో



## ప్రజల ముంగిటకే ప్రజావాణి

రెవెన్యూ డివిజన్ స్థాయిలో అమలుకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
హైదరాబాద్ రానవసరం లేకుండా స్థానికంగా ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణయం
డివిజన్ కేంద్రాల తర్వాత మండల స్థాయికి ప్రజావాణి సేవలు విస్తరణ
ప్రతి అర్జీని నమోదు చేసి పరిష్కార పురోగతిని బాధితులకు వివరించాలి
సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే సంబంధిత అధికారులదే బాధ్యత
ఫిర్యాదుల ట్రాకింగ్ కోసం అత్యాధునిక ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం ఏర్పాటు
పైస్థాయి అధికారులకు చేరేలా ఆటో ఎస్కలేషన్, అప్పీల్ వ్యవస్థల రూపకల్పన
రియల్ టైమ్ మానిటరింగ్ కోసం ప్రత్యేక నోడల్ అధికారుల నియామకం
ముగ్గురు అధికారుల కమిటీతో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమగ్ర సమీక్ష



3

## మత్తు పదార్థాలతో ప్రాణహాని తప్పదు

మాదక ద్రవ్యాల అమ్మకాలపై కఠిన చర్యలు
యువత ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి
గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోటి క్యాన్సర్ మరాథాన్
ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ అమ్మకాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటూ అణచివేస్తోందని రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. యువత ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తు దిశగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని రాయదుర్గం సత్వ నాలెడ్జ్ పార్క్‌లో గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ..మిగతా 2లో



## అణు శక్తి రంగంలో భారత్ సరికొత్త చరిత్ర

**మొదటిపేజీ తరువాయి**



పూర్తిస్థాయిలో తన పనిని ప్రారంభించిందని, ఇది ఇంధన రంగంలో భారత్‌ను స్వయంసమృద్ధి వైపు నడిపిస్తుందని పేర్కొన్నారు. గత మార్చిలో తాను వ్యక్తిగతంగా కల్పకం సందర్శించి రియాక్టర్ లోడింగ్ ప్రక్రియను వీక్షించినప్పుడు కలిగిన అనుభూతిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అణు ఇంధన కార్యక్రమాల వల్ల కేవలం విద్యుత్ ఉత్పత్తి మాత్రమే కాకుండా పారిశ్రామిక, ఆరోగ్య మరియు వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయని భరోసా ఇచ్చారు. సైన్స్ మరియు టెక్నాలజీ రంగాల్లో భారత్ సాధిస్తున్న ప్రగతి దేశ నిర్మాణానికి బలమైన పునాది వేస్తోందని, ముఖ్యంగా అంతరిక్ష పరిశోధనల్లో మన శాస్త్రవేత్తల చొరవ అద్భుతమని ప్రధాని ప్రశంసించారు.

దేశాభివృద్ధిలో పర్యావరణ హితమైన విద్యుత్ వనరుల ప్రాధాన్యతను వివరిస్తూ, పవన విద్యుత్ రంగంలో భారత్ సాధించిన ప్రగతిని మోదీ వివరించారు. ప్రస్తుతం దేశ పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 56 గిగావాట్లు దాటడం ఒక విశేషమని, గత ఏడాదిలోనే అదనంగా 6 గిగావాట్ల సామర్థ్యం పెరిగిందని వెల్లడించారు. భవిష్యత్తు అవసరాల కోసం సౌర మరియు పవన శక్తిపై ఆధారపడటం అనివార్యమని, కంటికి కనిపించని ఈ పవన శక్తే దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తోందని అభివర్ణించారు. ఇదే క్రమంలో దేశంలో జరుగుతున్న జనగణన2027 ప్రక్రియపై పౌరుల్లో అవగాహన కల్పించారు. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, ప్రతి భారతీయుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన ఈ డిజిటల్ జనగణనలో ప్రజలు అందించే సమాచారం అత్యంత సురక్షితంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎన్యుమరేటర్లు ఇళ్లకు రాకముందే సెల్ఫ్ ఎన్యూమరేషన్ పోర్టల్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవచ్చని, దీనివల్ల సమయం ఆదా అవుతుందని సూచించారు. ఇప్పటికే కోటి 20 లక్షలకు పైగా కుటుంబాలు గృహగణనలో పాల్గొనడం శుభపరిణామమని పేర్కొన్నారు.

భారతీయ చేతివృత్తుల కళాకారులను, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో వెదురు ఉత్పత్తుల మీద ఆధారపడి జీవిస్తున్న వారిని ప్రోత్సహించాలని ప్రధాని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కళాత్మకమైన వెదురు ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా ఆ రంగంలోని కార్మికుల ఆత్మస్థైర్యాన్ని పెంచవచ్చని, ఇతరులకు బహుమతులు ఇచ్చేటప్పుడు ఇటువంటి స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలాగే అంతర్జాతీయ వేదికలపై భారతీయ ఉత్పత్తుల సత్తాను ప్రస్తావిస్తూ, బ్రెజిల్‌లో జరిగిన అంతర్జాతీయ జున్ను పోటీల్లో రెండు భారతీయ బ్రాండ్‌లు అవార్డులు సాధించడం గర్వకారణమని చెప్పారు. మన దేశ సంప్రదాయ రుచులు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయని, ఇది డైరీ రంగంలో మన ఎదుగుదలకు నిదర్శనమని కొనియాడారు. భారతదేశపు 'వోకల్ ఫర్ లోకల్' నినాదం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి చేరుకుందని, భారతీయ ఉత్పత్తుల నాణ్యత ప్రపంచాన్ని ఆకర్షిస్తోందని ప్రధాని తన ప్రసంగంలో నొక్కి చెప్పారు. బుద్ధ పూర్ణిమ పండుగను పురస్కరించుకుని దేశ ప్రజలకు ముందస్తు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రధాని, గౌతమ బుద్ధుడి శాంతి సందేశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుత కాలంలో ఒత్తిడులు, సవాళ్లు ఎదుర్కొంటున్న మానవత్వానికి బుద్ధుడి బోధనలు సరైన దిశను చూపిస్తాయన్నారు. లడఖ్‌లో జన్మించిన ద్రుబ్‌పోన్ ఓట్జెర్ రిన్‌పోచె అనే వ్యక్తి చిలీ వంటి సుదూర దేశంలో బౌద్ధ ధర్మాన్ని ప్రచారం చేయడం గొప్ప విషయమని మెచ్చుకున్నారు. చిలీలోని కోచిగువాజ్ లోయలో ఆయన బౌద్ధ స్థూపాన్ని నిర్మించారని, అక్కడ ప్రజలకు ధ్యానాన్ని నేర్పిస్తూ భారతీయ సంస్కృతిని చాటుతున్నారని తెలిపారు. కర్ణాటకలోని అటవీ ప్రాంతాల్లో ఉన్న కర్మ బౌద్ధ ఆశ్రమం గురించి కూడా ప్రస్తావిస్తూ, అడవుల పరిరక్షణలో ఆశ్రమం పాత్రను అభినందించారు. శాంతి అనేది మన నుంచే ప్రారంభం కావాలని బుద్ధుడు చెప్పిన మాటను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ఈ విధమైన ఆధ్యాత్మిక, సామాజిక మరియు వైజ్ఞానిక పురోగతితో భారతదేశం విశ్వగురువుగా ఎదుగుతుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## స్వీయ గణనలో పాల్గొన్న కిషన్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి**

సమ్మిళిత వృద్ధికి ఖచ్చితత్వంతో కూడిన సమగ్రమైన గణాంకాలు చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు. 2027 జనాభా లెక్కల ప్రాముఖ్యతను వివరించిన శ్రీ జీ. కిషన్ రెడ్డి... ఆధునిక డిజిటల్ సాంకేతికతను ఉపయోగించటం ద్వారా ఇదొక పరివర్తనాత్మక దశగా నిలుస్తుందని పేర్కొన్నారు. తద్వారా పారదర్శకత, సామర్థ్యం, సమ్మిళితత్వం మరింత పెరుగుతాయని ఆయన అన్నారు. 2026 ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు స్వీయ గణన సౌకర్యం అందుబాటులో ఉంటుందని.. ఆ తర్వాత 2026 మే 11 నుంచి జూన్ 9 వరకు గృహ జాబితా సేకరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇది సమగ్ర సమాచార సేకరణకు బలమైన పునాది వేస్తుందని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న సామాజికఆర్థిక పరిస్థితులపై 2027 జనాభా లెక్కలు స్పష్టమైన అవగాహనను కల్పిస్తాయని.. అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడటంలో ఇవి సహాయపడతాయని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. జనాభా లెక్కల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరిన కేంద్ర మంత్రి.. ఇందులో ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. సేకరించే ప్రతి సమాచారం దేశ భవిష్యత్తుతో పాటు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్' స్వప్నాన్ని సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ జనాభా లెక్కల డైరెక్టరేట్ సంచాలకులు భారతి హోళికేరి మాట్లాడుతూ.. అధికారిక వెబ్‌సైట్ అయిన https://se.census.gov.in లో స్వీయ గణన ప్రక్రియను పూర్తి చేయవచ్చని, తద్వారా జనాభా లెక్కల్లో నేరుగా పాల్గొనవచ్చని తెలిపారు. సమర్పించిన సమాచారం పూర్తి గోప్యంగా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. సమాచారాన్ని సమర్పించిన వెంటనే ఒక 'స్వీయ గణన ఐడీ' వస్తుందని.. ఆ తర్వాత జనగణన అధికారి (ఎన్యూమరేటర్) దానిని పరిశీలించి ఖరారు చేస్తారని ఆమె వివరించారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్. వీ. కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా తదితరులు పాల్గొన్నారు.



# అవసరానికి మించి నీళ్లు ఇవ్వలేం

**మొదటిపేజీ తరువాయి**

మేర తాగునీరు అందుతుందని, ప్రస్తుతం పైపులైన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఐదు ప్రధాన వనరుల ద్వారా రోజుకు 600 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ, మంజీరా పైపులైన్లు బలహీనపడటం వల్ల కొంత ఇబ్బంది ఎదురవుతోందని వివరించారు. పాత పైపులైన్ల స్థానంలో కొత్తవి వేసేందుకు ప్రభుత్వం రూ. 720 కోట్లు మంజూరు చేసిందని, దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. అలాగే ఉస్మాన్ సాగర్ నుంచి అదనంగా 25 ఎంజీడీల నీటిని తీసుకువచ్చేందుకు కొత్త పైపులైన్ పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, ఇవి త్వరలోనే పట్టాలెక్కుతాయని ధీమా వ్యక్తం చేశారు.

సింగూరు డ్యామ్ మరమ్మతుల కారణంగా ప్రస్తుతం అక్కడ కేవలం 8 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని, వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అత్యవసర పంపింగ్ ద్వారా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని జలమండలి తెలిపింది. సరఫరాలో జరుగుతున్న నష్టాలను తగ్గించేందుకు సాంకేతిక చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు కూడా తమ వంతుగా స్నానం చేసేటప్పుడు, బ్రష్ చేసుకునేటప్పుడు నీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్యాప్ వాటర్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వం తాగునీటి సరఫరాకు ఎక్కడా అంతరాయం కలగకుండా నిధులు మంజూరు



చేస్తూ పనులను పర్యవేక్షిస్తోందని, ప్రజల సహకారం ఉంటేనే ఈ వేసవిని సులభంగా అధిగమించగలమని అశోక్ రెడ్డి ఆకాంక్షించారు. నీటిని పొదుపుగా వాడుతూ భావి తరాలకు జలనిధిని అందించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఆయన గుర్తు చేశారు.

## తెలంగాణలో చారిత్రక ఘట్టం

**మొదటిపేజీ తరువాయి**

చేయడం ద్వారా ఈ చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అదేవిధంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారుల సమక్షంలో తన వివరాలను ఎంటర్ చేసి సెల్ఫ్ ఎన్యూమరేషన్ పూర్తి చేసుకున్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దేశంలోనే తెలంగాణను జనగణనలో అగ్రస్థానంలో నిలపాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. స్వీయగణన అనేది ప్రతి ఒక్కరికీ ఒక ఐచ్ఛికం మాత్రమేనని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తమ వివరాలు తామే నమోదు చేసుకునే ఈ విధానం దేశ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

జనగణన ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు తెలంగాణ జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి వెల్లడించారు. నేటి నుంచి ప్రారంభమైన మొదటి దశలో స్వీయ ధ్రువీకరణ కింద మొత్తం 33 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మే 10వ తేదీ వరకు కొనసాగుతుంది. స్వీయగణన ముగిసిన తర్వాత మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యూమరేటర్లు నేరుగా క్షేత్రస్థాయిలో పర్యటించి హౌస్ లిస్టింగ్ ప్రక్రియ చేపడతారు. ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80 వేల మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నివాస గృహాలపై మార్కింగ్ చేయడం, కుటుంబాల వివరాలు సేకరించడం వంటి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రెండో దశ గణన ఉంటుందని, అప్పుడు వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని సమగ్రంగా సేకరిస్తామని డైరెక్టర్ వివరించారు. ఈ మొత్తం ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, సమాచార భద్రతకు ఎటువంటి భంగం కలగకుండా



నిర్వహిస్తున్నట్లు భరోసా ఇచ్చారు. ఏవైనా సందేహాలు ఉంటే ప్రజలు 1855 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

హైదరాబాద్ మహానగరంలో జనగణన నిర్వహణ కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని మూడు కార్పొరేషన్లను ఒకే యూనిట్‌గా పరిగణించి, కంటోన్మెంట్ ప్రాంతంతో కలుపుకొని మొత్తం 61 చార్జ్ ఆఫీసర్లను నియమించినట్లు వెల్లడించారు. డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తారని, నగరవాసులు తమ వివరాలను నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. 16 భాషల్లో పోర్టల్ అందుబాటులో ఉండటం వల్ల విభిన్న ప్రాంతాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. జనగణనతో పాటే కులగణన కూడా నిర్వహిస్తుండటం ఈసారి విశేషమని భారతి హోళికేరి పేర్కొన్నారు. దేశ జనాభా లెక్కల చరిత్రలోనే దీనిని 'మదర్ ఆఫ్ ఆల్ సెన్సెస్' (అన్ని సెన్సెస్ కు తల్లి వంటిది) గా అభివర్ణిస్తూ, ఈ బృహత్తర క్రతువులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. పారదర్శకమైన గణాంకాల వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల రూపకల్పన, అమలు మరింత సమర్థవంతంగా మారుతుందని యంత్రాంగం ఆశిస్తోంది.

## మత్తు పదార్థాలతో ప్రాణహాని తప్పదు

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించిన నోటి క్యాన్సర్ మారథాన్‌లో పాల్గొన్న ఆయన, 10కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, యువత యోగా, వ్యాయామం వంటి మంచి అలవాట్లను అలవరచుకోవాలని కోరారు.

చెడు అలవాట్ల వల్ల ప్రాణనష్టాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, సమాజంలో అవగాహన పెంపు అత్యవసరమని తెలిపారు. గుట్కా వంటి హానికర అలవాట్లపై చైతన్య కార్యక్రమాలుమరింత విస్తృతంగా నిర్వహించాలని అన్నారు. పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయని హెచ్చరించి, వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

సైబరాబాద్ సీపీ రమేష్ 5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. మరో అతిథిగా పాల్గొన్న బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు 2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నోటి క్యాన్సర్ కారణంగా దేశంలో లక్షలాది మంది మరణిస్తున్నారని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె. దిలీప్ కుమార్ మాట్లాడుతూ నోటి క్యాన్సర్‌పై అవగాహన పెంపు కోసం ఈ మరాథాన్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తిస్తే చికిత్స సాధ్యమవుతుందని, కాబట్టి ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగ దీపిక, డాక్టర్ సౌమ్య, డాక్టర్ వినూత్న, డాక్టర్ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని వివిధ సాఫ్ట్‌వేర్ సంస్థల ఐటీ ప్రొఫెషనల్స్, డాక్టర్లు, ప్రముఖులు, యువతతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రత్యేకంగా పాల్గొన్నారు.




### రంగుల సినిమా చూపించి రేవంత్
## అధికారంలోకి వచ్చాడు

**మొదటిపేజీ తరువాయి**



కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇటీవల శంషాబాద్ సమీపంలో తాము గతంలో తీసుకువచ్చిన ఒక కంపెనీ ప్రారంభోత్సవానికి రేవంత్ రెడ్డి వెళ్లారని, అక్కడ పిలిచే యాంకర్ కూడా ఆయనను గుర్తుపట్టలేకపోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి పేరు చెప్పడానికి బదులు మంత్రి శ్రీధర్ బాబు పేరును యాంకర్ ఉచ్చరించడాన్ని ప్రస్తావిస్తూ.. రేవంత్ రెడ్డి కేవలం తాము కట్టిన ప్రాజెక్టులకు రిబ్బన్లు కట్ చేయడం తప్ప కొత్తగా చేసిందేమీ లేదని దుయ్యబట్టారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. "100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని జేమ్స్ బాండ్ తరహాలో బాండ్ పేపర్లు రాసి ఇచ్చారు. గ్యారెంటీ కార్డులను భద్రంగా దాచుకోమని భట్టి విక్రమార్క ప్రజలకు చెప్పారు. కానీ ఇప్పుడు 1000 రోజులు కావస్తున్నా ఆ కార్డులు ఎక్కడ పెట్టుకోవాలో చెప్పాలి" అని ప్రశ్నించారు. రైతు, మహిళా, యువజన డిక్లరేషన్ల పేరుతో కాంగ్రెస్ 420 అడ్డమైన హామీలు ఇచ్చి ప్రజలను వంచించిందని ఆరోపించారు. హామీల అమలు గురించి అడిగితే రేవంత్ రెడ్డి వింత సమాధానాలు ఇస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. "మూడు నెలల్లో పిల్లలు పుడతారా? అని ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారు. సరే, మూడు నెలల్లో పుట్టకపోవచ్చు.. మరి 30 నెలలు గడిచినా ఒక్క హామీ అమలు కాకపోతే నిన్ను ఏమనాలి?" అని నిలదీశారు. కాంగ్రెస్ మాటలు ఆకాశంలో ఉన్నాయని, కానీ క్షేత్రస్థాయిలో పని మాత్రం సున్నా అని విమర్శించారు.

నల్గొండ జిల్లాకు చెందిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై కూడా కేటీఆర్ విరుచుకుపడ్డారు. ఆరడుగుల ఎత్తు ఉన్న ఉత్తమ్ వల్ల జిల్లాకు జరిగిన లాభం ఏమీ లేదని, కృష్ణా నీళ్లు తాగి పెరగడం తప్ప రైతుల కోసం ఆయన చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పు చేశామని ఇప్పుడు నల్గొండ జిల్లా రైతులే స్వయంగా చెబుతున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

### మలేరియా రహిత భారత్
## దిశగా అడుగులు

**మొదటిపేజీ తరువాయి**

హబ్సిగూడలోని సీసీఎంబీ కేంద్రంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా నిర్మూలనకు అవసరమైన మందులు, వ్యాక్సిన్ల తయారీలో నిమగ్నమైన పరిశ్రమల ప్రతినిధులు, వైద్య కళాశాలల నిపుణులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదన రావు మాట్లాడుతూ, 50వ దశకం నుంచి ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాల వల్ల మలేరియా కేసులు గణనీయంగా తగ్గినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో అప్రమత్తత చాలా అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా వాతావరణ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో దోమల సంతానోత్పత్తి వేగవంతమవుతోందని, ఇది వ్యాధి వ్యాప్తికి అనుకూలంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కేవలం గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన మలేరియా, ఇప్పుడు వలసలు మరియు పట్టణీకరణ వల్ల నగరాల్లో కూడా వేగంగా విస్తరిస్తోందని ఆయన వివరించారు.

మలేరియా పరాన్నజీవి మానవ శరీరంలో ప్రవేశించే తీరు, అది కలిగించే నష్టాలపై శాస్త్రవేత్తలు ఈ సదస్సులో కీలక విషయాలు వెల్లడించారు. దోమ కుట్టినప్పుడు విడుదలయ్యే స్పోరోజాయిట్స్ నేరుగా కాలేయానికి చేరుకుని వేల సంఖ్యలో మెరోజోయిట్స్‌గా వృద్ధి చెందుతాయని, ఈ దశలో రోగికి ఎటువంటి బాహ్య లక్షణాలు కనిపించవని సీసీఎంబీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పూరన్‌సింగ్ తెలిపారు. పరాన్నజీవులు కాలేయం నుంచి రక్తంలోని ఎర్ర రక్త కణాల్లోకి ప్రవేశించినప్పుడే మలేరియా లక్షణాలు బయటపడతాయని వివరించారు. ఈ క్రమంలో మలేరియాను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించడం అత్యంత ప్రధానమని శాస్త్రవేత్తలు సూచించారు. వైరస్ మరియు బ్యాక్టీరియాలతో పోలిస్తే మలేరియా పరాన్నజీవి నిర్మాణం చాలా సంక్లిష్టంగా ఉంటుందని, వీటిని ఎదుర్కొనే యాంటీబాడీలను అభివృద్ధి చేయడం శాస్త్రవేత్తలకు పెద్ద సవాలుగా మారిందని భారత్




బయోటెక్ ప్రతినిధులు వెల్లడించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టీకాలతో పాటు, ఎంఆర్ఎన్ఏ సాంకేతికతతో కొత్త టీకాల తయారీపై పరిశోధనలు సాగుతున్నాయని, అయితే వీటి నిల్వ మరియు రవాణాలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు.

వ్యాధి నివారణకు కొత్తగా అందుబాటులోకి వస్తున్న సాంకేతికత మరియు ఔషధాల గురించి కాన్సిటెల్ లైఫ్ సైన్సెస్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్.కె. దాష్ వివరించారు. హిమాలయాల్లో లభించే మొక్కల సారం ఆధారంగా రూపొందించిన 'ఒపుణికా' అనే హెర్బల్ మందు రక్తంతో పాటు కాలేయంలోని పరాన్నజీవులను సమర్థవంతంగా అడ్డుకుంటున్నట్లు వెల్లడించారు. ఐఐటీ మద్రాస్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల సహకారంతో కాలేయంలోనే వ్యాధి కారకాలను అంతం చేసే సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన అత్యధిక మలేరియా భారం ఉన్న దేశాల జాబితా నుంచి భారత్ బయటపడటం గొప్ప విజయమని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి కొనియాడారు. మలేరియాపై శాస్త్రీయ అవగాహన పెంచడంలో శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి ఫలిస్తోందని, త్వరలోనే మరింత శక్తివంతమైన వ్యాక్సిన్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే చిట్టచివరి వ్యక్తికి కూడా వైద్య సేవలు అందినప్పుడే భారత్ మలేరియా రహిత దేశంగా ఆవిర్భవిస్తుందని సదస్సులో పాల్గొన్న నిపుణులు ముక్తకంఠంతో చాటిచెప్పారు.

# ప్రజల ముంగిటకే ప్రజావాణి

- రెవెన్యూ డివిజన్ స్థాయిలో అమలుకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- హైదరాబాద్ రానవసరం లేకుండా స్థానికంగా ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణయం
- డివిజన్ కేంద్రాల తర్వాత మండల స్థాయికి ప్రజావాణి సేవలు విస్తరణ
- ప్రతి అర్జీని నమోదు చేసి పరిష్కార పురోగతిని బాధితులకు వివరించాలి
- సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే సంబంధిత అధికారులదే బాధ్యత
- ఫిర్యాదుల ట్రాకింగ్ కోసం అత్యాధునిక ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం ఏర్పాటు
- పైస్థాయి అధికారులకు చేరేలా ఆటో ఎస్కలేషన్, అప్పీల్ వ్యవస్థల రూపకల్పన
- రియల్ టైమ్ మానిటరింగ్ కోసం ప్రత్యేక నోడల్ అధికారుల నియామకం
- ముగ్గురు అధికారుల కమిటీతో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమగ్ర సమీక్ష

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయికి విస్తరించడం ద్వారా ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలని ఆయన సూచించారు. శుక్రవారం ఎంసీహెచ్ఆర్డీలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో పాల్గొన్న ముఖ్యమంత్రి, ప్రజలు తమ చిన్న చిన్న సమస్యల కోసం సుదూర ప్రాంతాల నుంచి హైదరాబాద్ లేదా జిల్లా కేంద్రాలకు రావాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి సేవలు ప్రారంభించాలని, ఆ తర్వాత దశలో వీటిని మండల స్థాయికి విస్తరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే జిల్లా మరియు రాష్ట్ర స్థాయిల్లో పెండింగ్ అర్జీల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండో రోజే మహాత్మా జ్యోతిభా పూలే ప్రజా భవన్ వేదికగా ప్రారంభమైన ఈ కార్యక్రమం, ఇప్పుడు గ్రామ స్థాయి వరకు వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో జవాబుదారీతనం పెంచేందుకు నిర్ణీత గడువులను నిర్ణయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు సమర్పించే ప్రతి అర్జీని డిజిటల్ పద్ధతిలో నమోదు చేయడంతో పాటు, ఆ ఫిర్యాదు ఏ దశలో ఉందో బాధితుడు తెలుసుకునేలా



ఏకీకృత డిజిటల్ ప్లాట్ ఫాం అభివృద్ధి చేయాలని ఆదేశించారు. జిల్లా మరియు రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ద్వారా పెండింగ్ ఫైళ్లను పర్యవేక్షించాలని సూచించారు. ఒకవేళ నిర్ణీత గడువులోగా కింది స్థాయి అధికారి సమస్యను పరిష్కరించకపోతే, ఆ అర్జీ ఆటోమేటిక్‌గా పైస్థాయి అధికారికి చేరేలా 'ఆటో ఎస్కలేషన్' వ్యవస్థను తీసుకురావాలని చెప్పారు. ప్రతి శాఖలో ప్రజావాణి కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలని, ప్రత్యేక నోడల్ అధికారులను నియమించాలని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు నిరంతరం ట్రాకింగ్ ఉండాలని, ఎక్కడైనా ఉద్దేశపూర్వక జాప్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రజావాణిపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులదేనని ఆయన గుర్తు చేశారు.

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ప్రణాళిక శాఖ ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రజావాణి పనితీరుపై సమీక్షలు నిర్వహిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. ప్రజావాణి ప్రారంభించిన నాటి నుంచి విశేష స్పందన లభిస్తోందని, నిరుపేదల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోందని ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఫిర్యాదుదారులకు భరోసా కల్పించేలా అప్పీల్ వ్యవస్థను కూడా బలోపేతం చేయాలని సూచించారు. డ్యాష్ బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతిని ముఖ్యమంత్రి కార్యాలయం నేరుగా పర్యవేక్షిస్తుందని తెలిపారు. వికేంద్రీకరణ ద్వారా పాలనను ప్రజల ముంగిటకే తీసుకెళ్లాలనే ప్రభుత్వ లక్ష్యం ప్రజావాణి ద్వారా నెరవేరుతుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కేవలం అర్జీలు తీసుకోవడమే కాకుండా, వాటి పరిష్కారంలో నాణ్యత ఉండాలని, బాధితుడికి సంతృప్తికరమైన సమాధానం అందాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజావాణి సేవలు అందుబాటులోకి వస్తే సామాన్యులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని ప్రభుత్వం భావిస్తోంది.



**కొత్త ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ ను కలిసి శుభాకాంక్షలు తెల్పిన లెక్చరర్ల సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు చట్ల ప్రవీణ్ కుమార్.**

**ఆదిలాబాద్, ఏప్రిల్ 26(డి డి 9వార్త న్యూస్ ):**

తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ & సెక్రటరీని కొత్తగా తెలంగాణ ప్రభుత్వం అభిలాష అభినవ్ ను నియమించిన మేరకు తెలంగాణ గజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (TGJLA 475) ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధులు ఆదివారం రోజు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసిశుభాకాంక్షలు తెల్పి పూలమొక్కను అందించి అభినందనలు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చట్ల ప్రవీణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కొండ గోవర్ధన్ లు పూల మొక్కను అందజేశారు. నూతన కమిషనర్ తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థ మరింత ముందుకు తీసుకెళ్లి అభివృద్ధి పథంలో విద్యా ర్థుల భవిష్యత్తుకు దృఢమైన పునాది నిర్మాణం కావావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యా రంగంలో నాణ్యతపెంపు,పర్యవేక్షణ పరిపాలనలో పారదర్శకతకు కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

## పోలీసులపై తిరగబడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు జైలుకు తరలింపు.

**బజార్ హత్నూర్, ఏప్రిల్ 26(డిడి 9వార్త ):**

బజార్హత్నూర్ మండలంలోని ముత్యంపేట కాలనీలో తేదీ 24 శుక్రవారం సాయంత్రం 05:00 గంటలకు వడ్డెర కులానికి చెందిన ఇరు వర్గాలు గొడవ పడుతున్నారని 100 ఫోన్ నెంబర్కు డయల్ రాగా గొడవ ఆపడానికి తక్షణమే అక్కడికి వెళ్ళిన పోలీసులపై ఇరువర్గాలలోని ఇద్దరు వ్యక్తులుఇత్తారిరాజేష్( 30) s/o రాజన్న,ధారంగుల దుర్గేష్(25) S/o రాములు పోలీసులపైదురుసుగా ప్రవర్తిస్తూ చేతులతో తోసివేసి, కొట్టడమే కాకుండా ఇక్కడి నుంచి వెళ్లకపోతే చంపుతామని బెదిరించడంతో వారిపై బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి జైలుకు తరలించడమైనదని అంతేకాకుండా మద్యం మత్తులో గొడవ పడుతూ ప్రజాశాంతికి భంగం కలిగించిన ఇరు వర్గాలలోని మరోఆరుగురువ్యక్తుల పై కేసు నమోదు చేయనైనదని బజా ర్హత్నూర్ ఎస్ఐ జి.రమేష్ తెలిపారు.





## కమ్మర్‌పల్లిలో 108 సిబ్బందికి కూలర్ వితరణ

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 26 (డీడీ9 వార్త) : .**

అత్యవసర వేళల్లో ప్రాణదాతలుగా నిలుస్తున్న 108 సిబ్బందికి కమ్మర్‌పల్లి సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్ అండగా నిలిచారు. భానుడి భగభగలతో అల్లాడుతున్న సిబ్బంది ఇబ్బందులను గుర్తించి, వారికి తక్షణమే కూలర్‌ను వితరణ చేశారు. మండల కేంద్రంలోని 108 కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, తాము వేసవి తాపాన్ని తట్టుకోలేకపోతున్నామని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సర్పంచ్ హారిక, ఉప సర్పంచ్ అశోక్ దంపతులు ఆదివారం స్వయంగా కార్యాలయానికి వెళ్లి కూలర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చుట్టుపక్కల మండలాలకు అత్యవసర సేవలు అందిస్తూ ఎంతోమంది ప్రాణాలను కాపాడుతున్న 108 సిబ్బంది సేవలు వెలకట్టలేనివి. అటువంటి వారు ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్నారని తెలియగానే తక్షణమే స్పందించాం. వారికి ఈ చిన్న సహాయం అందించడం మాకు సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తమ విన్నపాన్ని మన్నించి తక్షణమే స్పందించినందుకు 108 సిబ్బంది సర్పంచ్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రోత్సాహంతో ప్రజలకు మరింత రెట్టింపు ఉత్సాహంతో సేవలు అందిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సుభాష్ గౌడ్, రవి, మాజీ ఎంపీటీసీ సుధాకర్, మహేందర్, రమేష్‌తో పాటు 108 సిబ్బంది సాగర్, విజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం


**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 26 (డీడీ9 వార్త) : .**

మీసేవ కేంద్రాల కమిషన్‌ను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ చిరకాల వాంఛను నెరవేర్చినందుకు కృతజ్ఞతగా ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖలీల్‌వాడి అంబేద్కర్ భవన్‌లో మీసేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఈఎస్‌డీ కమిషనర్ రవి కిరణ్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైర శంకర్ చిత్రపటాలకు మీసేవ నిర్వాహకులు క్షీరాభిషేకం చేసి తమ సంతోషాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బైర శంకర్, జిల్లా అధ్యక్షుడు నవీన్ రాజ్ మాట్లాడుతూ.. మీసేవ కేంద్రాల నిర్వహణలో ఎదురవుతున్న ఆర్థిక సవాళ్లను గుర్తించి కమిషన్ పెంచడం అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది ఆపరేటర్ల కుటుంబాల్లో వెలుగులు నిండాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మండలం ఉట్నూర్ నరేష్‌తో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న మీసేవ ప్రతినిధులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేశారు.

## మీసేవ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సత్కారం

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 26 (డీడీ9 వార్త) : .**

తెలంగాణ మీసేవ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో కమ్మర్‌పల్లి మండలానికి చెందిన ఉట్నూర్ నరేష్‌కు అరుదైన గౌరవం దక్కింది. జిల్లా కేంద్రంలో జరిగిన ఈ సమావేశంలో నరేష్ చేపడుతున్న సేవలను గుర్తించి, రాష్ట్ర కమిటీ సభ్యులు బైర శంకర్, జిల్లా అధ్యక్షుడు నవీన్ రాజ్ ఆయనను ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉట్నూర్ నరేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర, జిల్లా కమిటీలు తనపై చూపిన ఆదరణకు, ఈ గౌరవానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ గుర్తింపు తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులోనూ మీసేవ ఆపరేటర్ల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు, పలువురు మీసేవ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మంజీర నదిలో గొర్ల కాపరి మునిగి మృతి

**బీర్కూర్, ఏప్రిల్ 26(డిడి9 వార్త):**

ఆదివారం ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో జుక్కల్ మండలం ఖండేబల్లూర్ గ్రామానికి చెందిన గొర్ల కాపరి చాకలి మొగలజి తండ్రి లచ్చన్న విషాదకరంగా మంజీర నదిలోమునిగి మరణించారు.వివరాల ప్రకారం, చాకలి మొగలజి గోర్లు మేపుతూ నది వద్దకు వచ్చి, ఒక మేకను నీటిలోకి దింపిన అనంతరం దాని వెనుక వెళ్లారు.ఈ క్రమంలో ఆయన నది మధ్య ప్రాంతంలోకి వెళ్లి ప్రమాదవశాత్తూ మునిగిపోయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న బీర్కూర్ ఎస్సై రాములు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లను పిలిపించి మృతదేహాన్ని వెలికితీయించారు.అనంతరం మృతుడి భార్య నుండి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.



## ఆధ్యాత్మిక వాతావరణంలో లింబద్రి గుట్ట ప్రదక్షిణ

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 26 (డీడీ9 వార్త) : .**

భీమ్‌గల్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం లింబద్రి గుట్ట వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది. యోగా సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉదయం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. పవిత్రమైన కొండ చుట్టూ భజనలు, ఆధ్యాత్మిక నామస్మరణ చేస్తూ భక్తులు ప్రదక్షిణలు గావించారు. మార్గమధ్యలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఈ సందర్భంగా యోగా నిర్వాహకులు బద్రి మాట్లాడుతూ.. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల మానసిక ప్రశాంతత లభించడంతో పాటు సమాజంలో ఐక్యత పెరుగుతుందని పేర్కొన్నారు. గిరి ప్రదక్షిణలో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు ఆధ్యాత్మిక చింతన కలుగుతుందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాకేష్, శంకర్, నారాయణ (మణిదీప), ప్రశాంత్, పి. శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# టాక్సిక్ అలాంటి సినిమా.. ఒక్క మాటతో అంచనాలు పెంచిన రుక్మిణి వసంత్



మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ టాలెంటెడ్ నటి రుక్మిణి వసంత్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె ఇప్పటికే పలు చిత్రాల్లో నటించి ఇండియా వ్యాప్తంగా మంచి గుర్తింపును సంపాదించుకుంది. ప్రస్తుతం ఈ నటి చేతిలో అనేక క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. కె.జి. యఫ్ లాంటి భారీ విజయం తర్వాత యష్ నటిస్తున్న టాక్సిక్ చిత్రంలో ఈమె ఓ కీలకమైన పాత్రలో నటించింది. ఈ సినిమాను జూన్ 4వ తేదీన విడుదల చేయనున్నారు. దీంతో ఈ సినిమా ప్రమోషన్ల నిమిత్తం ఈమె పెద్ద ఎత్తున ఇంటర్వ్యూలలో పాల్గొంటూ వస్తోంది. తాజాగా ఈ బ్యూటీ ఓ ఇంటర్వ్యూలో ఈ చిత్రం గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది.

తాజాగా రుక్మిణి వసంత్ మాట్లాడుతూ... టాక్సిక్ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఇప్పటివరకు నేను ఈ రేంజ్ సినిమాను ఎక్కడా చూడలేదు. ముఖ్యంగా ఒకరి గురించి ప్రత్యేకంగా మాట్లాడాలి. ఆయనే యష్. ఈ సినిమా కోసం ఆయన చేసిన కష్టం వర్ణనాతీతం. ఆయన కేవలం ఈ సినిమా కోసం కష్టపడడం మాత్రమే కాకుండా భారీగా ఖర్చు కూడా పెట్టారు. ఆయన కూడా ఇందులో నిర్మాత కావడం వల్ల ఈ సినిమా స్థాయి మరింత పెరిగిందని ఈ నటి చెప్పుకొచ్చింది. ఇలా టాక్సిక్ గురించి ఈ బ్యూటీ గొప్పగా చెప్పడంతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉందని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

# 'కర' తెలుగు ట్రైలర్ లాంచ్ వేదిక ఖరారు.



ధనుష్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'కర' చిత్రాన్ని ఏప్రిల్ 30వ తేదీన విడుదల చేయనున్నారు. ఈ సినిమాను తమిళ్‌తో పాటు తెలుగులో కూడా అదే తేదీన విడుదల చేయనున్నారు. దీంతో ఈ మూవీ బృందం తాజాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్ రిలీజ్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనను విడుదల చేసింది. ఈ మూవీ తెలుగు ట్రైలర్‌ను ఈ రోజు సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో జరిగే ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో భాగంగా విడుదల చేయనున్నట్లు ఈ మూవీ బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మూవీపై ప్రస్తుతానికి తెలుగు ప్రేక్షకుల్లో పెద్దగా అంచనాలు లేవు. ఈ రోజు విడుదల కాబోయే ట్రైలర్ బాగుంటే, ఈ సినిమాపై టాలీవుడ్ ప్రేక్షకుల్లో అంచనాలు పెరిగే అవకాశం ఉందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. విఘ్నేష్ రాజా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమితా బైజు, కేఎస్ రవికుమార్, జయరామ్ కీలక పాత్రల్లో నటించారు. జివి ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందించాడు.

# ప్రియాంక ఖాతాలో మరో గ్లోబల్ అవార్డు!



బాలీవుడ్ నుంచి ప్రపంచ స్థాయి నటిగా ఎదిగిన ప్రియాంక చోప్రా క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కేవలం సినిమాలకే పరిమితం కాకుండా, సామాజిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనే ఆమెకు మరోసారి అంతర్జాతీయ వేదికపై సముచిత గౌరవం దక్కింది. ఆసియా పసిఫిక్ ప్రాంతానికి చెందిన ప్రముఖులను సత్కరించే ప్రతిష్టాత్మక సంస్థ 'గోల్డ్ హౌస్' (Gold House), ఈ ఏడాది తమ గోల్డ్ గాలాలో ప్రియాంకను ప్రత్యేకంగా గౌరవించబోతోంది. వివిధ రంగాల్లో రాణిస్తున్న అత్యున్నత ఆసియా ప్రముఖులతో గోల్డ్ హౌస్ ప్రతి ఏటా 'గోల్డ్ 100' జాబితాను విడుదల చేస్తుంది. ఈ ఏడాదికి గాను ప్రియాంక చోప్రాను 'గ్లోబల్ వాన్‌గార్డ్ ఆనర్' (Global Vanguard Honor) తో సత్కరించనున్నట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. వినోద రంగంలో ఆమె సాధించిన విజయాలతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ఆసియా సంస్కృతిని ప్రతిబింబించడంలో ఆమె పోషిస్తున్న పాత్రను గుర్తిస్తూ ఈ అవార్డును అందజేస్తున్నారు. ఐదవ ఎడిషన్‌గా జరుగుతున్న ఈ గోల్డ్ గాలాను 'ఎ న్యూ గోల్డ్ వరల్డ్' (A New Gold World) అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. కావున ఈ వేడుక మే 9, 2026న లాస్ ఏంజిల్స్‌లో అత్యంత వైభవంగా జరగనుంది.

# మోసం కేసులో ట్విస్ట్.. మౌనం వీడిన అషు రెడ్డి




లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ధర్మేంద్ర అనే వ్యక్తిని ప్రేమ, పెళ్లి పేరుతో రూ. 9.5 కోట్లు మోసం చేశారంటూ.. తనపై నమోదైన పోలీసు కేసుపై సోషల్ మీడియా సెన్సేషన్ అషు రెడ్డి తొలిసారి స్పందించారు. ఈ వివాదం టాలీవుడ్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన తరుణంలో, ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక పవర్‌ఫుల్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. అషు రెడ్డి ఇన్ స్టా స్టోరీలో ఏముందంటే? తమపై వస్తున్న వార్తలను ఖండిస్తూ అషు రెడ్డి తన స్టోరీలో ఇలా పేర్కొన్నారు 'నా అనుమతి లేకుండా, నా గురించి ఎటువంటి తప్పుడు సమాచారాన్ని లేదా వార్తలను ప్రచారం చేసినా, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు (Severe Legal Action) తీసుకోబడతాయి' అని స్పందించింది. గతంలో డ్రగ్స్ కేసు వంటి వివాదాలు చుట్టుముట్టినప్పుడు కూడా అషు రెడ్డి ఇలాగే ధైర్యంగా స్పందించారు. ఇప్పుడు కూడా తనపై వస్తున్న ఆరోపణలను 'తప్పుడు సమాచారం'గా కొట్టిపారేస్తూ, మీడియా,సోషల్ మీడియా హ్యాండిల్స్‌కు వార్నింగ్ ఇచ్చారు. నిజానిజాలు తేలకముందే తన ప్రతిష్టకు భంగం కలిగిస్తే సహించేది లేదని ఆమె పరోక్షంగా హెచ్చరించారు. కానీ పోలీసుల దర్యాప్తు ఒకవైపు సాగుతుండగా, అషు రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. బాధితుడి కుటుంబం వద్ద ఉన్న ఆధారాలకు అషు రెడ్డి ఎలా సమాధానం ఇస్తారు? చట్టపరంగా ఆమె ముందుకెలా వెళ్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# మైసా పోరు



అగ్ర కథానాయిక రష్మిక 'మైసా'తో తన నటనలో మరో కోణాన్ని తెరపై ఆవిష్కరించనుందని చెబుతున్నాయి ఆ సినిమా వర్గాలు. ఈ చిత్రం కోసమే రష్మిక కొన్నిరోజుల కిందట బ్యాంకాక్ వెళ్లి యాక్షన్ డైరెక్టర్ ఆండి లాంగ్ పర్యవేక్షణలో ప్రత్యేకమైన స్టంట్స్‌కి సంబంధించిన మెళకువలు నేర్చుకున్నారు. ఆ యుద్ధ విద్యలన్నిటినీ ఉపయోగిస్తూ కేరళ అడవుల్లో పోరాట ఘట్టాల్లో నటిస్తున్నారు. రష్మిక ఓ గోండు గిరిజన యువతిగా నటిస్తున్న చిత్రమే 'మైసా'. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్నారు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇటీవలే కేరళలో కీలకమైన సన్నివేశాల చిత్రీకరణని ప్రారంభించినట్టు తెలిపింది చిత్రబృందం. ఈ షెడ్యూల్‌లో భాగంగా యాక్షన్ కొరియోగ్రాఫర్ కేచా నేతృత్వంలో 15 రోజుల పాటు పోరాట ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నామని, ఎంతో గాఢతతో కూడిన ఆ సన్నివేశాలు సినిమాకే హైలెట్‌గా నిలుస్తాయని చిత్రవర్గాలు చెప్పాయి.



## 'గాయపడ్డ సింహం' లో శ్రీవిష్ణు.. కేవలం స్పెషల్ రోల్ కాదు సీక్వెల్ ప్లాన్‌లో చిత్ర బృందం

తరుణ్ భాస్కర్ హీరోగా కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన మూవీ 'గాయపడ్డ సింహం'. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్‌తో ఈ చిత్రంపై హ్యూజ్ బజ్ క్రియేట్ కాగా.. తాజాగా రిలీజైన ట్రైలర్‌తో సినిమాపై మరిన్ని అంచనాలు పెరిగాయి. అయితే.. ఈ ట్రైలర్‌లో హీరో శ్రీవిష్ణు కూడా కనిపించిన విషయం తెలిసిందే. దీంతో ఇందులో శ్రీవిష్ణు ఓ కామియో రోల్‌లో నటిస్తున్నట్లు అంతా భావించారు. అలాగే ఈ హీరో ఎంట్రీతో 'గాయపడ్డ సింహం' మరింత బలం పుంజుకొన్నట్టైంది. అయితే.. తాజాగా అందుతున్న సమాచారం మేరకు ఇందులో శ్రీవిష్ణుది గెస్ట్ పాత్ర కాదట. ఈ సినిమాలో ఆయన స్క్రీన్ స్పేస్ 30 నిమిషాల పాటు ఉంటుంది. అలాగే ఈ సినిమా హిట్టయితే.. శ్రీవిష్ణుతోనే సీక్వెల్ ప్లాన్ చేసే ఆలోచనలో ఉందట చిత్ర బృందం. దానికి సంబంధించిన లీడ్ కూడా క్లైమాక్స్‌లో చూపించబోతున్నారని తెలుస్తుంది.

# రామోజీ ఫిల్మ్ సిటీలో ఎన్టీఆర్ యాక్షన్



ఆలస్యమైనా.. అభిమానులు కోరుకునేలా కథానాయకుడు ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తోన్న సినిమాని తీర్చిదిద్దుతోంది చిత్రబృందం. 'డ్రాగన్' పేరుతో ప్రచారంలో ఉన్న ఈ సినిమాను నందమూరి కల్యాణ్ రామ్, నవీన్ ఎర్నేని, రవి శంకర్ యలమంచిలి, హరి కృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కొన్ని భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ పీటర్ హెయిన్ నేతృత్వంలో ఎన్టీఆర్, ఇతర తారాగణంపై వీటిని తెరకెక్కిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో యాక్షన్, భావోద్వేగాల మేళవింపుగా దీన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది జూన్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో ఎన్టీఆర్‌కి జోడీగా రుక్మిణీ వసంత్ కనిపించనున్నట్లు సమాచారం.

# 'రాకాస' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్..



యంగ్ హీరో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించిన క్రేజీ ఫాంటసీ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాకాస'. ఏప్రిల్ 3న థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించిన ఈ చిత్రం, మెగా డాటర్ నిహారిక కొణిదెల తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎంతో ప్యాషన్‌తో నిర్మించారు. మానస శర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన ఈ హారర్ ఎలిమెంట్స్‌కు స్వచ్ఛమైన కామెడీని జోడించి ఆమె మలిచిన విధానం విమర్శకుల ప్రశంసలు పొందింది. ఇక ఇప్పుడు డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ (Netflix) ఈ సినిమా డిజిటల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం, 'రాకాస' చిత్రం మే 1, 2026 నుండి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో కూడా ఈ సినిమా అందుబాటులోకి రాబోతోంది. వేసవి సెలవుల్లో ఇంటి దగ్గరే కూర్చుని ఫ్యామిలీతో కలిసి హాయిగా నవ్వుకోవడానికి ఇదొక బెస్ట్ ఆప్షన్ అని చెప్పొచ్చు. ముఖ్యంగా వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీనుల కామెడీ ఈ సినిమాకు అసలైన బలం. వీరి ముగ్గురి టైమింగ్ థియేటర్లలో నవ్వుల పువ్వులు పూయించింది. తన నేచురల్ యాక్టింగ్‌తో సంగీత్ మరోసారి యూత్‌ను ఆకట్టుకున్నారు. థియేటర్లలో మిస్ అయిన వారు లేదా మరోసారి ఈ ఫన్ రైడ్‌ను ఎంజాయ్ చేయాలనుకునే వారు మే 1 కోసం ఎదురుచూస్తున్నారు. హారర్ సినిమాలను ఇష్టపడే వారితో పాటు కామెడీ ప్రియులకు కూడా 'రాకాస' ఒక మంచి ఎంటర్‌టైనర్ కానుంది.